## క్లుప్తంగా

### కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన సెర్ప్ డీపీఎం



వివరాలు తెలుసుకుంటున్న డీపీఎం, ఏపీఎం

**కథలాపూర్:** మండలంలోని చింతకుంట, సిరికొండ, భూషణరావుపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సెర్ప్ డీపీఎం మల్లేశం శుక్రవారం పరిశీలించారు. ఏ గ్రామాల్లో ఎంత ధాన్యం కొనుగోలు చేశారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేశారు.ధాన్యం తూకం వేసినప్పటికీ లారీలు రావడం లేదని పలువురు రైతులు డీపీఎం దృష్టికి తీసుకువచ్చారు. లారీల కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ధాన్యం బస్తాలను త్వరగా తరలించాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం నరహరి, సీసీలు విజయనిర్మల, అంజయ్య తదితరులు ఉన్నారు.

### పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

**రాయికల్:** వార్డుల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాయికల్ పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఆయా వార్డుల్లో ప్రజాప్రతినిధులతో కలిసి పనులను పరిశీలించారు.

**గ్రామాల్లో పారిశుధ్య పనులు పరిశీలన**

మండలంలోని తాట్లవాయి, వస్తాపూర్ గ్రామాల్లో శుక్రవారం పారిశుధ్య పనులను ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు. అనంతరం తాట్లవాయిలోని నర్సరీలను పరిశీలించి మొక్కలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

### క్రీడాకారుడికి అండగా ఉంటాం



రవాణా ఖర్చులు అందిస్తున్న శైలేందర్‌రెడ్డి

**జగిత్యాల:** కిక్‌బాక్సింగ్ క్రీడాకారుడు సాయి సృజన్‌కు అండగా ఉంటామని బీజేపీ నాయకులు డాక్టర్ శైలేందర్‌రెడ్డి అన్నారు. జగిత్యాలలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న సృజన్ కిక్‌బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నాడు. గతంలో జరిగిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించి జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.దీనికోసం రవాణా ఖర్చులను డాక్టర్ శైలేందర్‌రెడ్డి అందించారు. ప్రతి ఒక్కరు చిన్నతనంలోనే అన్ని రంగాల్లో ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోచ్ రామాంజనేయులు ఉన్నారు.

### వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



నిల్వ నీటిని పారబోస్తున్న అధికారులు

**పెగడపల్లి:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి గోపాలకృష్ణమూర్తి అన్నారు. ప్రత్యేక శానిటేషన్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని అయితపల్లిలో శుక్రవారం పర్యటించారు. నీటి తొట్టిలు, డబ్బాల్లో ఎక్కువ రోజులు నీటిని నిల్వ చేయడం వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వననర్సరీ, కంపోస్టుషెడ్‌లను పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ కొండయ్య, ఎంపీవో మహేందర్, అంగన్‌వాడీ టీచర్ సీతమ్మ, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ఆశవర్కర్లు ఉన్నారు.

### రైస్‌మిల్లర్ల దోపిడీ అరికట్టాలి

**రాయికల్:** జగిత్యాల జిల్లాలో రైస్‌మిల్లర్ల దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని బీజేపీ జిల్లా నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాయికల్ మండలం ఆలూరు కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద తూర్పాల పట్టిన ధాన్యాన్ని సైతం మిల్లర్లు కటింగ్ చేయడం సరికాదన్నారు. ఆయన వెంట కిసాన్‌సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెక్కొండ రాంరెడ్డి నాయకులు కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి నోచుకోని లింకురోడ్లు

- ప్రతిపాదనలకే పరిమితం
- రోడ్లు వేస్తే తగ్గనున్న దూరభారం
- ఏళ్లు గడుస్తున్నా నిధులకు మోక్షమేది?



అర్పపల్లి-లక్ష్మీదేవిపల్లి గ్రామాల మధ్య మట్టి రోడ్డు

**సారంగాపూర్:** ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన లింకు రోడ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. గ్రామాల మధ్య దూర భారం తగ్గించడానికి ఏర్పాటు చేసిన రోడ్లు నత్తనడకన సాగుతున్నాయి. గతంలో గ్రామానికి, గ్రామానికి మధ్య అంతర్గత రోడ్లను ఏర్పాటు చేశారు. రోడ్లు అభివృద్ధి జరగకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల పలు రోడ్లను అభివృద్ధి చేసినప్పటికీ ఇంకా అభివృద్ధి చేయాల్సిన రోడ్లు ఎక్కువగా ఉన్నాయి.

**సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో అభివృద్ధి చేయాల్సిన లింక్ రోడ్లు...**

- అర్పపల్లి–లక్ష్మీదేవిపల్లి గ్రామాల మధ్య 5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. పొలాల గుండా వేసిన రోడ్డు కేవలం 1.50 కిలోమీటర్ల దూరం ఉంటుంది. దీనిపై తారురోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.
- రంగపేట – రేచపల్లి గ్రామాల మధ్య లింకు రోడ్డు అటవీశాఖ అభ్యంతరంతో ఆగిపోయింది.
- రంగపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఒడ్డెర కాలనీకి ఎస్సారెస్పీ కాలువ వెంట కంకర రోడ్డు నిర్మాణం చేపట్టి వదిలేశారు.
- బట్టపల్లి నుంచి మోహన్‌రావుపల్లె మధ్య 100 మీటర్ల సీసీ రోడ్డు పనులు చేయాల్సి ఉంది.
- రేచపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి తలుపుల తండా మీదుగా మ్యాడారంతండా వెళ్లేందుకు కంకర రోడ్డు నిర్మించి, కొంత మట్టి రోడ్డు నిర్మాణం చేశారు.

**మంగేళ నుంచి రంగసాగర్ మధ్య 5కిలోమీటర్ల మట్టిరోడ్డును గతంలో ఏర్పాటు చేశారు. తారురోడ్డుగా మార్చాలి.**

- కమ్మునూర్ చిత్రవేణిగూడెం గ్రామాల మధ్య 3 కిలోమీటర్ల మట్టిరోడ్డును తారుగా మార్చాలి..
- తుంగూర్ -దొంతాపూర్ గ్రామాల మధ్య 2.50 కిలోమీటర్ల మట్టిరోడ్డులో కిలో మీటర్ మాత్రమే పూర్తి చేశారు.
- బీర్‌పూర్ ఆసునూరిగూడెం నుంచి లంబాడి తండాకు 2.50 కిలోమీటర్ల కంకర రోడ్డు వేయగా దీనికి గిరిజనాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పనులను చేపట్టాల్సి ఉంది.

**రేకులపల్లి నుంచి వయా చిన్నకొల్వాయి, చిత్రవేణిగూడెం వరకు ఉన్న మట్టిరోడ్డును అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి.**

- కొత్తపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి లచ్చ నాయక్ తండా వరకు, రంగపేట ఆర్‌అండ్‌బీ క్రాస్‌రోడ్డు నుంచి నాగునూర్ వరకు, రంగపేట నుండి ఆలూర్ క్రాస్ రోడ్డు (బతుకమ్మ కుంట) వరకు రోడ్లు అభివృద్ధి చేయాలి.

ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి లింకు రోడ్లకు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**లింక్ రోడ్డు అత్యవసరం**



పెంబట్ల నుంచి రంగపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు వైపు రైతుల పొలాలు ఉన్నాయి. ఇక్కడికి చేరుకోవడానికి కేవలం కిలోమీటరన్నర దూరం ఉంటుంది. లింక్‌రోడ్డు అభివృద్ధి జరగకపోవడంతో లక్ష్మీదేవిపల్లి మీదుగా పొలాలకు చేరుకోవడంతో 5 కిలోమీటర్ల దూరం పోవలసి వస్తోంది.

– తోట లక్ష్మి, పెంబట్ల

**రోడ్లకు ప్రతిపాదనలు పంపాం**



ఉమ్మడి మండలంలో అవసరం ఉన్న చోట లింక్ రోడ్లను అభివృద్ధి చేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఇటీవల సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పలు రోడ్లను సీసీ, తారు రోడ్లుగా అభివృద్ధి చేశా. నిధులు విడుదలైన విధంగా అంచలంచెలుగా రోడ్లను అభివృద్ధి చేస్తాం.

– భూపతి ఏఈ పీఆర్

## సీఎం చిత్రపటాలకు వీఆర్‌ఏల క్షీరాభిషేకం



దోనూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

**పెగడపల్లి:**వీఆర్‌ఏల ఉద్యోగాలు క్రమబద్ధీకరించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు తిరుపతి, కార్యదర్శి కనకేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**కథలాపూర్:** భీమారం మండలకేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, సర్పంచ్ చెక్కపెల్లి అరుణ, ఏఎంసీ చైర్‌పర్సన్ రమ్య, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు వంగ వెంకటేశం, రఘు తదితరులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం:** వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు, ప్రమోషన్‌లు కల్పించి వారసులకు ఉద్యోగాలు ఇవ్వడం వంటి డిమాండ్లను సీఎం కేసీఆర్ ఆమోదించడంతో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఎం చిత్రపటానికి వీఆర్‌ఏలు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు సుధాకర్, సతీశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**ధర్మపురి:** గ్రామ రెవెన్యూ సహాయకులను క్రమబద్ధీకరణకు సీఎం ఆదేశాలు జారీ చేయడంపై వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని దోనూర్‌లో వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండపెల్లి సువర్ణ, మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు జంగిలి మధూకర్, ఎంపీటీసీ దేవి సత్తవ్వ, నాయకులు పాల్గొన్నారు.

**రాయికల్:** సీఎం కేసీఆర్ వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం తహసీల్ కార్యాలయ ఆవరణలో వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రాజయ్య, నవీన్, రాజయ్య, గంగారెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

**మల్లాపూర్:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి వీఆర్‌ఏలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు షేక్ రఫీ హైమద్, మండల ఉపాధ్యక్షుడు తోగరి రాజేందర్, గౌరవ అధ్యక్షుడు రామెల్ల రాజకిషన్, కోశాధికారి ఉరుమడ్ల శ్రీనివాస్, కార్యదర్శి నవీన్, సభ్యులు చిట్యాల వినోద్, నితీశ్, నరేశ్, లావణ్య, పద్మ, బాజన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

**కోరుట్ల రూరల్:** వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై మండల వీఆర్‌ఏల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కోరుట్ల డివిజన్ వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు జి. గంగాధర్, మండలంలోని వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

## నేషనల్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక

**కథలాపూర్:** నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు మేడిపెల్లి మండలంలో నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో నరేశం శుక్రవారం తెలిపారు. మేడిపెల్లి మోడల్‌స్కూల్‌కు చెందిన ఏలేటి దనూష, మరిపెల్లి దివిష్ణ, పొన్నం మణికంఠ, మన్నెగూడెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎనగంటి కార్తీక శ్రేణి ఎంపికయ్యారు. వీరికి ఇంటర్ పూర్తయ్యేవరకు ఏడాదికి రూ. 12 వేల చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈవో నరేశం, సర్పంచ్ నరేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజేందర్, హెచ్‌ఎం నరసింహమూర్తి అభినందించారు.

**రాయికల్:** మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు ఎన్‌ఎంఎస్‌ఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్రీధర్ తెలిపారు. పాఠశాలకు చెందిన వైష్ణవి, సుగంధిక, సుషిత, కౌశిక్, మనీశ్‌లు ఎంపికయ్యారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు.

**ఇబ్రహీంపట్నం:** మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని దొనికెన వైష్ణవి జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నవీన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని శుక్రవారం మోడల్‌స్కూల్‌లో సర్పంచ్ నేమూరి లత సన్మానించారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, ఎంపీటీసీ తిమ్మణి రాములు, సింగిల్‌విండో చైర్మన్ బద్దం గోపి, నాయకులు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

**కథలాపూర్:** గ్రామాల్లోని పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. శుక్రవారం మేడిపెల్లి మండలం వల్లంపెల్లిలో చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ తరుపున ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ రోజుల్లో వైద్యం చాలా ఖరీదైనదని, ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఏమైనా ఆరోగ్య సమస్యలుంటే త్వరగా చికిత్స అందించే వీలుంటుందన్నారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి వీరికి ఉచితంగా వైద్యం అందించేందుకు కరీంనగర్‌లోని ఆస్పత్రికి రావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెల్మ సమత, ఎంపీటీసీ మమత, జగిత్యాల బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి, న్యాయవాది తన్నీరు శ్రీనివాస్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

## గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ

**జగిత్యాల:** ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ మార్కెటింగ్ మిషన్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లాలో గ్రామీణ నిరుద్యోగ యువతకు శిక్షణతో పాటు భోజనం, హాస్టల్ వసతితో కూడిన రకరకాల కోర్సులపై శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్‌బేవరేజ్, హెల్త్‌కేర్, బ్యూటీషియన్, ఎలక్ట్రికల్, ఆటోమోటివ్ కోర్సులున్నాయని, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులు జిరాక్స్ సర్టిఫికెట్లతో ఈనెల 25న జిల్లా సమైక్య కార్యాలయంలో హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 83282 60158 సంప్రదించాలని కోరారు.

## గంగమ్మతల్లికి బోనాలు

**జగిత్యాల:** స్థానిక గంగమ్మతల్లి బోనాల మహోత్సవంలో బీజేపీ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ బోగ శ్రావణి మాట్లాడుతూ గంగమ్మతల్లి అందరిని చల్లగా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, రమేశ్, దివాకర్, గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి మెమోలు జారీ

**మల్లాపూర్ :** మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి శుక్రవారం ఎంపీడీవో రాజశ్రీనివాస్ మెమోలు జారీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో అఖిల భారత యాదవ సంఘం సభ్యులు సమావేశం నిర్వహించుకోవడం మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీంతో ఎంపీడీవో రాజ శ్రీనివాస్ కార్యాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ తో సహా అటెండర్ల వరకు అందరికి మెమో జారీ చేశారు. ప్రభుత్వానికి సంబంధించిన కార్యక్రమాలకు మినహా ఇతర సమావేశాలకు ఎంపీడీవో కార్యాలయాన్ని వేదికగా చేసుకోవద్దని, అలా ఎవరైనా సమావేశాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మహిళల రక్షణకు 181 హెల్ప్‌లైన్

**జగిత్యాలరూరల్:** మహిళల రక్షణ కోసం 181 హెల్ప్‌లైన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని సఖీ సెంటర్ కేస్ వర్కర్ శారద అన్నారు. శుక్రవారం మండలం మోరపల్లిలో ఉపాధిహామీ కూలీలకు 181 హెల్ప్‌లైన్ ఆవశ్యకత, సఖీ కేంద్రం ద్వారా మహిళలకు అందిస్తున్న సేవలను కూలీలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలకు అండగా నిలుస్తూ సఖీ సెంటర్ ద్వారా మహిళలకు విశిష్ట సేవలందిస్తున్నామన్నారు. గృహ హింస, వరకట్న వేదింపులు, పనిచేసే చోట మహిళలకు వేధింపులు, లైంగిక హింస, ఆడపిల్లల అక్రమ రవాణా, అమ్మకం, నివారణలో సఖీ సెంటర్ నిరంతరం కృషి చేస్తుందన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ బొల్లె సత్తమ్మ, ఎంపీటీసీ భూమారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ జక్కుల గంగాధర్, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం పీఆర్ ఏఈగా అరుణ

**ఇబ్రహీంపట్నం:** మండల పీఆర్ ఏఈగా అరుణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఏఈ నిరంజన్‌రెడ్డి మెట్‌పల్లికి బదిలీపై వెళ్లారు. సుల్తానాబాద్ సబ్ డివిజన్‌లో పనిచేసిన అరుణ ఇబ్రహీంపట్నంకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అరుణను ఎంపీపీ జాజాల భీమేశ్వరి, ఎంపీడీవో ప్రభు తదితరులు సన్మానించారు.

**ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా కొండ్లెపు అనిల్**

**కోరుట్ల:** ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కొండ్లెపు అనిల్ నియామకమయ్యాడు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బైరి వెంకటేశం శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ ఎస్సీ 57 ఉప కులాలకు ప్రభుత్వ పథకాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. సంఘ బలోపేతానికి కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ధాన్యం సేకరణలో నిలువు దోపిడీ



రైతులతో మాట్లాడుతున్న సుజిత్‌రావు

**మల్లాపూర్:** ధాన్యం సేకరణలో రైతులు నిలువ దోపిడీకి గురవుతున్నారని పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. మండలంలోని పాత దాంరాజుపల్లిలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆరుగాలం కష్టించి పండించి ధాన్యాన్ని అమ్ముకునే విషయంలో ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం సేకరణలో మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. మిల్లర్లు క్వింటాలుకు 8 నుంచి 15 కిలోల వరకు కోత విధిస్తున్నారని పేర్కొన్నారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం సరికాదని, తక్షణమే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, ఉమ్మడి జిల్లా మత్స్యకార్మిక డైరెక్టర్ కల్లెడ గంగాధర్, పాక్స్ డైరెక్టర్ కొత్తూర్ నారాయణరెడ్డి, నాయకులు కొమ్ముల చిన్నారెడ్డి, మామిడి రాజశేఖర్‌రెడ్డి, గడ్డం రాజేందర్‌రెడ్డి, కొత్తూరి చిన్న రాజరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యాదవులను కించపరిస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న గనవేని మల్లేశ్

**మల్లాపూర్:** యాదవులను కించపరిస్తే సహించేది లేదని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి గనవేని మల్లేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సభలో పాల్గొని మాట్లాడారు. యాదవ కులవృత్తులను కించపరిచే విధంగా రేవంత్‌రెడ్డి మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై, యాదవ సమాజంపై అనుచిత వాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో రేవంత్‌రెడ్డిని రాష్ట్ర వ్యాప్తంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ మండల ఉపాధ్యక్షుడు బజారు మదన్‌యాదవ్, అధికార ప్రతినిధి అల్లె చంద్రయ్యయాదవ్, మండల నాయకులు తోట్ల శ్రీనివాస్‌యాదవ్, ముక్కెర రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలి



సమావేశంలో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు

**జగిత్యాలరూరల్:** గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో రాజేశ్వరి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌పై సమీక్షసమావేశం నిర్వహించారు. గ్రామాల్లో రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, నీరు నిల్వ ఉండే గుంతలను పూడ్చేయాలన్నారు. . ఉపాధిహామీ కూలీలకు ప్రతిరోజు పని కల్పించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రవిబాబు, సూపరింటెండెంట్ గంగాధర్, ఏపీవో గంగలక్ష్మణ్, ఈసీ మనోజ్ పాల్గొన్నారు.

**ఇంటికో ఇంకుడుగుంత తప్పనిసరి**

గ్రామాల్లో ఇంటికో ఇంకుడుగుంత ఉండేలా మహిళా సంఘాలు కృషి చేయాలని ఎంపీడీవో రాజేశ్వరి అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్‌లో శనివారం ఇంకుడు గుంత పనులను ప్రారంభించి మాట్లాడారు. వృథా నీటికి అడ్డుకట్ట వేసేందుకు ఇంకుడు గుంతలు ఉపయోగపడతాయన్నారు. ఇంకుడుగుంతల నిర్మాణంతో భూగర్భజలాలను పరిరక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకు జాన్, ఏపీవో గంగ లక్ష్మణ్ పాల్గొన్నారు.

## వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్

**ధర్మపురి:** వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తమ్మ అన్నారు. ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్ పర్సన్ సంగి సత్తమ్మ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మొత్తం 25 అంశాలకు గాను 25 అంశాలను ఆమోదించారు. వాటిలో వార్డుల్లో స్లాబ్ బిల్లుల ఏర్పాటు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, ఓపెన్ జిం అభివృద్ధి పనులు, పైపులైన్ లీకేజీలు, పార్కింగ్ గేట్ ముఖ్యంగా మార్చి 2023 మాసం యొక్క ఆదాయ వ్యయాలు, ఇతర బల్లులు తదితర అంశాలు ఆమోదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేశ్, వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మేనేజర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు**

**జగిత్యాల:** జిల్లా కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఆలయ అధ్యక్షుడు బట్టు సుధాకర్, ప్రేమ్ కుమార్, శ్రీనివాస్, నాగభూషణం, తౌటు రాంచంద్రం, ఉమాపతి పాల్గొన్నారు.

**కోరుట్లలో ఇళ్ల స్థలాలు సాధిస్తాం**

**కోరుట్ల:** పట్టణంలోని పూలే అంబేద్కర్ నగర్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు సాధిస్తామని సీపీఐ ఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల బాలకృష్ణ అన్నారు. శుక్రవారం కామ్రేడ్ పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతి సభలో మాట్లాడారు. సుందరయ్య తన జీవితాన్ని ప్రజల కోసం దారపోశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎం జిల్లా కమిటీ సభ్యుడు తిరుపతి నాయక్, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేశ్, జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన, నాయకులు ఎంఏ చౌదరి, రాజలింగు, మహిపాల్ నాయక్, రజియ సుల్తానా, రాజశేఖర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

**విద్యుత్ తీగ తెగిపడి ఆవు మృతి**

**మల్యాల:** మేత మేస్తున్న ఆవుపై విద్యుత్ తీగ తెగిపడడంతో ఆవు మృతిచెందిన ఘటన మల్యాల మండలం తక్కళ్లపల్లిలో చోటుచేసుకుంది. మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన రైతు గుండ సత్తయ్యకు చెందిన ఆవు శుక్రవారం మేత మేస్తుండగా విద్యుత్ తీగ తెగి ఆవుపై పడింది. దీంతో సుమారు రూ.50 వేల విలువైన ఆవు అక్కడిక్కడే మృతిచెందింది. మల్యాల విద్యుత్ ఏఈడీ సీహెచ్.బాలలింగం, ఏఈ కొమ్ము కమలేశ్వర్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాద సంఘటనపై విచారణ చేపట్టామని ఏడీఈ తెలిపారు.

**పారిశుధ్యంలో మెట్‌పల్లి డివిజన్‌ను ముందుంచాలి**

**ఇబ్రహీంపట్నం :** పారిశుధ్యంలో జగిత్యాల జిల్లాలోనే మెట్‌పల్లి డివిజన్‌ను ముందు ఉండేలా చేద్దామని డీపీవో దేవరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జగిత్యాల జిల్లా డీపీవో బాధ్యతలు స్వీకరించి మొట్టమొదటి సారిగా మండలానికి రావడంతో మండల ప్రత్యేకాధికారి బాలే శివాజీ ,ఎంపీడీవో ప్రభు, ఎంపీపీ జాజాల భీమేశ్వరి, సర్పంచ్ నేమూరి లత సన్మానించారు. మెట్‌పల్లి డివిజన్‌లో పారిశుధ్యం లోపించకుండా అందరం కలిసికట్టుగా పనిచేసి జాతీయ అవార్డును తీసుకువద్దామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, ఎంపీడీవో ప్రభు, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీవో కృపాకర్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, ఎంపీటీసీ తిమ్మణి రాములు, మండల పంచాయతీ కార్యదర్శులు ,కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

**నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత**

**సారంగాపూర్:** మండలంలోని సారంగాపూర్, లక్ష్మీదేవిపల్లి, రేచపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని 18 గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.